


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 16-6-2025
సంపుటి: 21 సంచిక: 71
పేజీలు: 8 వెల: రూ.1




# అరికట్టాల్సినవారే అవినీతిపరులుగా!

❖ఈ శాఖకూ పాకిన మంత్లీల దుస్సంప్రదాయం
❖అటువంటి ఉదంతమే విశాఖలో వెలుగులోకి
❖రాజకీయ ప్రాపకంతో ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట
❖కింది స్థాయిలో మూకుమ్మడి బదిలీలు
❖వారి స్థానంలో కొత్తవారు రాక ఏసీబీ ఖాళీ

అవినీతి అధికారుల భరతం పట్టడమే లక్ష్యంగా ఏర్పాటైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో కూడా అవినీతికి పాల్పడే అధికారులున్నారన్న విషయం ఆలస్యంగానైనా ప్రభుత్వానికి అర్థమైంది. పోలీస్ శాఖ వారికి పునరావాస కేంద్రంగా భావించే ఏసీబీకి కూడా అవినీతి చెదలు పట్టాయని సాక్ష్యాత్తు ఆ శాఖ ఉన్నతాధికారులే అంచనాకు వచ్చినట్టు కనిపిస్తోంది. అందుకే కొద్ది రోజులు క్రితం ఏపీ రీజియన్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా వరకు ఏసీబీలో ఐదేళ్లకు మించి పని చేస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ క్యాడర్ ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేశారు. ఏసీబీలో సుదీర్ఘ కాలంగా పాతుకుపోయిన ఉద్యోగులను ఇంత పెద్ద ఎత్తున.. అది కూడా విద్యాసంవత్సరం ప్రారంభమైన తర్వాత బదిలీలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో ఏసీబీ వ్యవస్థాగతంగా ఏపీ, సెంట్రల్, రాయలసీమ రీజియన్ అనే విభాగాలుగా పని చేస్తుంది. ఇందులో శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా వరకు ఆంధ్రప్రదేశ్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ రీజియన్‌లోనే పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. ఎవర్నీ దేబరించకుండా రైట్‌రాయల్‌గా సొమ్ము వసూలుచేయడం ఇటీవల ఏసీబీకి పరిపాటిగా మారింది. లంచం తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునే విషయంలో ఇంతకుముందున్న మార్గదర్శకాలను కఠినతరం చేయడంతో అవినీతి నిరోధక శాఖలో ఇటీవల రైడ్‌లు తగ్గిపోయాయి. దీనికి తోడు కొన్ని శాఖలపై ఏసీబీ పూర్తిగా దృష్టి సారించడం మానేసింది. దానికి కారణం.. మంత్లీల కింద ఈ శాఖల నుంచి ఏసీబీ అధికారులకు అడగకుండానే పంపించేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా విశాఖపట్నంలో ఇటువంటి వ్యవహారం వెలుగుచూడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీలో రాజకీయ ప్రాపకంతో తిష్ట వేసుక్కూర్చున్న ఉద్యోగులపై దృష్టి సారించాల్సి వచ్చింది. కొన్నాళ్ల క్రితం విశాఖపట్నంలో నకిలీ నోట్లు మార్పిడి చేస్తూ దొరికిపోయిన ఒక మహిళా రిజర్వ్ ఎస్సై ఆ తర్వాత రీపోస్టింగ్ తెచ్చుకున్నారు. ఇటీవల విశాఖపట్నంలో ఓ ప్రాంతంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమె ఫోన్ చేసి తాను ఏసీబీ నుంచి మాట్లాడుతున్నానని, ఈ నెల మంత్లీ ఇంకా పంపలేదేమంటూ సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. దీంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. ఏసీబీలో కూడా మంత్లీలు ఉంటాయని బయటి ప్రపంచానికి తెలిసింది. దీనివల్ల ఏసీబీ ప్రతిష్ట మసకబారుతోందని భావించిన ఉన్నతాధికారులు ఏలూరు నుంచి శ్రీకాకుళం వరకు పాతుకుపోయిన ఉద్యోగులను ఎత్తి అవతల వేశారు.

### అమలు కాని నిబంధనలు

వాస్తవానికి ఏసీబీలోకి బదిలీ కావాలని ఎప్పట్నుంచో అనేకమంది పోలీసులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రాజకీయ పలుకుబడితో పాతవారే కొనసాగుతుండటం వల్ల వీరికి అవకాశాలు రావడంలేదు. నిబంధనల ప్రకారం అధికారులు మూడేళ్లకు మించి, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగులు ఐదేళ్లకు మించి ఏసీబీలో పని చేయకూడదు. పరిచయాలు పెరగడం వల్ల అవినీతికి ఆస్కారం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో ఇటువంటి నిర్ణయం తీసుకున్నారు. కానీ చాలాకాలంగా ఇది అమలుకాలేదు. అందుకే విశాఖపట్నంలో కొన్ని ప్రభుత్వ శాఖల నుంచి మంత్లీ సంస్కృతి మొదలైంది. అయితే వాటిని పంచుకోవడంలో తేడాలు రావడం వల్ల విషయం బయటకు పొక్కి పత్రికలకెక్కింది. పోలీస్ శాఖలో నిజాయితీపరులుగా, పనిమంతులుగా పేరొందినవారిని ప్రత్యేకించి ఈ విభాగంలోకి తీసుకుంటారు. అలాగే పోలీస్ శాఖ నుంచి డిప్యూటేషన్ మీద కూడా వస్తుంటారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీస్ సిబ్బంది నిత్యం ఏదో ఒక విచారణ లేదా దర్యాప్తు కోసం ప్రభుత్వ శాఖలకు వెళ్లడం పరిపాటి. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు అధికారులు సంబంధిత ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి లంచాలు వసూలుచేస్తుంటారనే ఆరోపణలున్నాయి. విశాఖపట్నంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది.

### ఇక్కడ అవినీతిపై అడిగేవారే లేరు!

ప్రభుత్వ విభాగాల అధికారులపై ఆరోపణలు వస్తే వెంటనే విచారణ జరిపి చర్యల కోసం సిఫార్సులు చేసే ఏసీబీ అధికారులపై ఆరోపణలొస్తే మాత్రం ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఈ విభాగం పునరావాస కేంద్రంగా తయారైంది. ప్రస్తుతం ఎన్నికలు వంటి హడావుడి లేనందున ఈ శాఖలో పని చేయడం కంటే యూనిఫామ్ ఉండే విభాగాల్లో పని చేస్తే నాలుగు రాళ్లు సంపాదించుకోవచ్చనే భావనతో ఏసీబీ డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ లాంటి పోస్టులకు ఎవరూ దరఖాస్తు చేసుకోవడంలేదు కానీ, వాస్తవానికి ఇది డిమాండ్ ఉన్న పోస్టే. స్టాంప్స్

- మిగతా చివరి పేజీలో



✶నాలుగు దశాబ్దాల క్రితం ఇరాక్‌పై దాడులు
✶ఇప్పుడు ఇరాన్‌పైనా అదే యుద్ధతంత్రం
✶తనకంటే పెద్ద దేశాలనే ముప్పుతిప్పలు పెడుతున్న ఇజ్రాయెల్
✶అణు స్థావరాల ధ్వంసమే ప్రధాన లక్ష్యమని ప్రకటన

"విస్తీర్ణం పరంగా ఇజ్రాయెల్ చాలా చిన్న దేశం. యూదులు మెజారిటీ జనాభాగా ఉన్న ఈ దేశం చుట్టూ ఉన్నవన్నీ అరబ్ దేశాలే. అన్నింటితోనూ ఇజ్రాయెల్‌కు దశాబ్దాలుగా శత్రుత్వమే. ఇప్పటికే పాలస్తీనాలో భాగమైన గాజాపై ఇజ్రాయెల్ నాలుగైదు నెలలుగా సైనిక దాడులతో మారణహోమం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. అటు లెబనాన్, సిరియా, యెమెన్ దేశాలతోనూ, ఒకప్పుడు ఇరాక్‌తోనూ ఇజ్రాయెల్‌కు సైనిక ఘర్షణలు కొత్త కాదు. మిగతా దేశాల మాటెలా ఉన్నా తన కంటే ఎన్నో రెట్లు పెద్ద దేశాలైన ఇరాన్, ఇరాక్‌లతో కయ్యానికి కాలుదువ్వడమే కాకుండా.. ఇరాక్‌కు నాలుగు దశాబ్దాల క్రితం, ఇరాన్ తాజా సైనిక చర్యతో ఇజ్రాయెల్ చుక్కలు చూపిస్తోంది."



# చుక్కలు చూపిస్తున్న చిట్టెలుక!

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

ప్రస్తుతం ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధమే. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కకావికలమవుతుండటం, తొమ్మిది మంది వరకు సైనిక జనరళ్లను, కీలకమైన అణు కేంద్రాలను, ఎయిర్‌పోర్టును కోల్పోవడం విస్మయం కలిగిస్తోంది. విస్తీర్ణపరంగా చూస్తే పశ్చిమాసియాలోనే ఇరాన్ పెద్ద దేశం. పైగా అణ్వస్త్ర సంపత్తి కలిగి ఉంది. అదే ఇజ్రాయెల్ అయితే కేవలం ఒక్క రోజులో మొత్తం చుట్టి రాగలిగేంత చిన్న దేశం. కానీ ఇజ్రాయెల్ అమెరికా పెద్ద దన్ను. అన్నింటికీ మించి ప్రపంచంలో అత్యంత కఠినమైనదిగా పేరొందిన మొస్సాద్ గూఢచార సంస్థ దానికి వెయ్యేనుగుల బలం ఇస్తోంది. వీటి సాయంతోనే ఇజ్రాయెల్ తన చుట్టూ మోహరించినట్లు ఉండే అరబ్, ఇస్లామిక్ దేశాలను గడగడలాడిస్తోంది. అదే క్రమంలో సుమారు ఏడాది కాలంగా ఇరాన్‌ను దెబ్బకొడుతోంది. ఐదు రోజులుగా జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ అత్యున్నత దళమైన ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్ (ఐఆర్‌జీసీ) అధినేత మేజర్ జనరల్ హుస్సేన్ సలామీతో సహా తొమ్మిదిమంది అత్యున్నత సైనికాధికారులను మట్టుబెట్టింది. ఐఆర్‌జీసీ సామాన్యమైనది కాదు. ఇది నేరు ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీకి మాత్రమే జవాబుదారీ. అంతటి పవర్‌ఫుల్ దళాన్ని ఇజ్రాయెల్ ఏడాదిన్నరగా టార్గెట్ చేస్తోంది. సిరియాలోనూ గత ఏడాది ఐఆర్‌జీసీ కమాండర్లను హతమార్చింది. ఇప్పుడు ఏకంగా ఐఆర్‌జీసీ చీఫ్‌నే.. అదీ ఆయన స్వదేశంలోనే అంతం చేసింది. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన నాటి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. హమాస్ కు ఇరాన్ మద్దతు ఉందనేది ఇజ్రాయెల్ ఆరోపణ. గత ఏడాది ఇరుదేశాలు దాదాపు యుద్ధం వరకు వెళ్లాయి. ఆ నేపథ్యంలో రెండు వేల కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న ఇజ్రాయెల్‌పె ఇరాన్ జరిపిన క్షిపణుల దాడిని ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ వ్యవస్థ అడ్డుకుంది.

### అణు ముప్పును తగ్గించుకునే నెపం

ఇరాన్‌ను తన అస్తిత్వానికి ముప్పుగా ఇజ్రాయిల్ భావిస్తోంది. ఇరాన్ చేతికి అణ్వాయుధాలు అందకూడదనేది దాని లక్ష్యం. అందుకే 2005 నుంచి ఇరాన్ అణు కార్యక్రమాలను నిశితంగా గమనిస్తోంది. ప్రస్తుతం ఇరాన్ అణ్వాస్త్రాలకు అవసరమయ్యే యూరేనియాన్ని శుద్ధి చేసినట్లు అనుమానిస్తున్న ఇజ్రాయెల్ సమయం కోసం ఎదురు చూసింది. అమెరికాతో ఇరాన్ అణు చర్చలు విఫలమై తక్షణమే దానిపై విరుచుకుపడింది. ముఖ్యంగా ఇరాన్ అణు కార్యక్రమాలు, వారి సైంటిస్టులను టార్గెట్ చేసి దాడులు చేసింది. ఐఆర్‌జీసీ సుశిక్షితమైనదే కాదు.. దీనికి మూడు దళాలు ఉంటాయి. ఇక ఇజ్రాయెల్ కంటే ఇరాన్ దాదాపు 70 రెట్లు పెద్దది. జనాభాపరంగానూ ఇజ్రాయెల్ కంటే ఇరాన్ జనాభా 10 రెట్లు ఎక్కువే. కానీ యుద్ధంలో ఏడాదిన్నరగా ఇరాన్ మాత్రమే ఎక్కువ నష్టపోతోంది. తొమ్మిదిమంది అణు శాస్త్రవేత్తలు ఇజ్రాయెల్ దాడిలో చనిపోయారు. గత ఏడాది మేలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఇక సుప్రీం లీడర్ అలీ ఖమేనీవి కూడా పైపై హెచ్చరికలే తప్ప వాస్తవంలో చేసేది ఏమీ కనిపించడం లేదు. ఇదంతా చూస్తుంటే.. అతి చిన్నదైన ఇజ్రాయెల్ ముందు పెద్ద దేశమైన ఇరాన్ తలొంచినట్లు కనిపిస్తోంది.

### అప్పట్లో ఇరాక్‌పైనా ఇదే తరహా దాడులు

ఇరాక్‌పై కూడా 1981లో ఇజ్రాయెల్ ఇలాగే దాడులు చేసింది. 1981లో 14 ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు సినాయ్ ద్వీపకల్పంలోని ఎట్జియన్ ఎయిర్ బేస్ నుంచి వెళ్లి ఇరాక్ రాజధాని బాగ్దాద్‌పై దాడులు చేశాయి. బాగ్దాద్‌కు సమీపంలో ఉన్న ఒసిరాక్ అణు కేంద్రంపైనా ఇజ్రాయిల్ ఫైటర్ జెట్లు విరుచుకుపడ్డాయి. ఏకంగా 1100 కి.మీ దూరం నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఈ దాడి చేసింది. 'ఆపరేషన్ ఒపేరా' అనే కోడ్‌నేమ్‌తో నిర్వహించిన ఈ దాడి అప్పట్లో పెద్ద సంచలనం. ఇరాక్ అణు కార్యక్రమం 1950 చివర్లో ప్రారంభమైంది. అయితే 1970లో సద్దాం హుస్సేన్ హయాంలో ఈ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. 1976లో ఇరాక్ ఫ్రాన్స్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఫ్రెంచ్ ప్రభుత్వం ఇరాక్‌కు 70 మెగావాట్ల పరిశోధన రియాక్టర్‌ను సరఫరా చేసేందుకు అంగీకరించింది. రియాక్టర్ డిజైన్ పేరు ఒసిరాక్. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కింద ఉన్న రియాక్టర్లను అధికారికంగా శాంతియుత ప్రయోజనాలకు ఉద్దేశించా. అయితే ఒకసారి రియాక్టర్ ప్రారంభమైన తర్వాత దాన్ని ఆయుధ గ్రేడ్ ప్లూటోనియం ఉత్పత్తి చేయడానికి కూడా ఉపయోగించవచ్చని, అది తనకు ముప్పు అని ఇజ్రాయిల్ పసిగట్టింది. దాంతో అప్పటి ఇజ్రాయిల్ సైనిక దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాఫెల్ ఈటన్ ఆధ్వర్యంలో ప్లాన్ ప్రారంభమైంది. 1980లో ఎనిమిది ఎఫ్ 16 ఫైటర్లను దాడి చేసేందుకు, వాటికి రక్షణ కవచంగా ఆరు ఎఫ్ 15 ఏ ఫైటర్ జెట్లను ఏర్పాటు చేసింది. శత్రువుల రాడార్లకు చిక్కకుండా వెళ్లి ఇరాక్ రియాక్టర్లను నేలమట్టం చేయాలని ప్లాన్ చేసింది. ఆ మేరకు కేవలం వంద అడుగుల ఎత్తులోనే.. జోర్డాన్ మీదుగా ఆగ్నేయ దిశగా సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించి, అక్కడ నుంచి బాగ్దాద్ వైపు ఫైటర్ జెట్లు వెళ్లేలా ప్రణాళిక రచించారు. దీనివల్ల ఇరాకీ రాడార్ల నుంచి ఇజ్రాయెల్ విమానాలు తప్పించుకున్నప్పటికీ జోర్డాన్ రాజు హుస్సేన్ వాటిని గుర్తించి ఇరాక్‌కు అందించడానికి తమ దేశ యంత్రాంగం ద్వారా ప్రయత్నించారు. కానీ కమ్యూనికేషన్ వైఫల్యం వల్ల ఈ సమాచారం బాగ్దాద్‌కు చేరలేదు. ఫలితంగా ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు నిరాటంకంగా ఇరాక్ గగనతలంలోకి ప్రవేశించి కేవలం రెండు నిమిషాల్లోనే ఇరాక్ అణు రియాక్టర్లపై బాంబులు వేసి నాశనం చేసి తిరిగి ఇజ్రాయెల్‌కు చేరుకున్నాయి. ఐక్యరాజ్యసమితి, అమెరికా, ఫ్రాన్స్ ఇజ్రాయెల్ చర్యను ఖండించినా ఏమాత్రం వెరవని అప్పటి ఆ దేశ ప్రధాని మెనాచెమ్ బిగిన్ మాట్లాడుతూ.. ఏ అరబ్ దేశాన్ని కూడా అణ్వాయుధాలు తయారు చేయనీయబోమని స్పష్టం చేశారు. ఇప్పటికీ ఇదే సిద్ధాంతాన్ని ఇరాన్ విషయంలో ఇజ్రాయిల్ వర్తింపచేస్తోంది.



• ఎడిటోరియల్

# మూడో ప్రపంచ యుద్ధం దిశగా..!

ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. మానవ సమాజం మూడో ప్రపంచ యుద్ధం దిశగా సాగతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించినప్పుడే ఈ ఆందోళనలు వ్యక్తమయ్యాయి. రష్యాకు మద్దతుగా వార్సా దేశాలు, ఉక్రెయిన్‌కు వైపు నాటో కూటమి, ఐరోపా యూనియన్ దేశాలు నిలవడంతో మూడేళ్ల క్రితమే మూడో ప్రపంచ యుద్ధం సంభవించవచ్చేమోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. అయితే అదృష్టవశాత్తు ఆయా దేశాలు ఉక్రెయిన్‌కు ఆర్థిక, ఆయుధ సహాయం అందించడంతోపాటు రష్యాపై ఆర్థిక ఆంక్షలకే పరిమితం కావడంతో నాడు ఆ ముప్పు తప్పిపోయింది. తర్వాత ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలోనూ మరో ప్రపంచ యుద్ధం భయాలు అలుముకున్నా.. అది ఆ రెండు దేశాలకే పరిమితమైంది. అయితే ఇప్పటికే ఇటు పాలస్తీనా, అటు లెబనాన్, మరోవైపు యెమన్ వంటి అరబ్ దేశాలతో తలపడుతున్న ఇజ్రాయెల్ ఉన్నఫళంగా ఉరుములేని పిడుగు మాదిరిగా ఇరాన్‌పై రాత్రికి రాత్రి సైనికచర్యకు దిగడంతో తీవ్రంగా నష్టపోయిన ఆ దేశం అదే స్థాయిలో ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులు చేసింది. అది మొదలు గత ఐదురోజులుగా రెండు దేశాల మధ్య బాలిస్టిక్ క్షపణులు సహా అతి ప్రమాదకరమైన ఆయుధాలతో జరుగుతున్న దాడులు ఇరు దేశాలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఈ రెండు దేశాల యుద్ధం వల్ల అంతర్జాతీయంగా అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే చమురు ధరలు పెరిగిపోతున్నాయి. ఇంకా బంగారంతో సహా అనేక సరుకుల ధరలు పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితే తీవ్ర ఆందోళన కలిగిస్తుంటే.. పరస్పరం తలపడుతున్న ఇజ్రాయెల్, ఇరాన్‌లకు మద్దతుగా పలు దేశాలు రంగంలోకి దిగుతున్నాయి. తమ ప్రాధమ్యాలకు అనుగుణంగా ఇజ్రాయెల్ వైపు కొన్ని, ఇరాన్ వైపు మరికొన్ని దేశాలు చేరి మేము సైతం.. అంటూ రణభేరి మోగిస్తున్నాయి. అగ్రరాజ్యమైన అమెరికా తొలి నుంచీ ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తోంది. తమతో అణు నిరాయుధీకరణ ఒప్పందానికి నిరాకరిస్తున్న ఇరాన్‌పై ఇప్పటికే కారాలు మిరియాలు నూరుతున్న ట్రంప్ సర్కార్.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడి పలువురు సైనికాధికారులను, అణు శాస్త్రవేత్తలను హతమార్చడంతో సంబరపడిపోతోంది. ఇంకా తీవ్రంగా దాడి చేయాల్సిందని కూడా సాక్షాత్తు ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌లో ఉన్న తమ సైనిక స్థావరాలపై దాడులకు పూనుకుంటే.. పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని కూడా ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఒక ప్రకటన చేస్తూ ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రపంచ దేశాలను హెచ్చరించింది. ముఖ్యంగా అగ్రదేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సైనిక స్థావరాలను, వారి యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. అయితే ఇరాన్ బెదిరింపులను బ్రిటన్(యూకే) లెక్కచేయలేదు. ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించడమే కాకుండా వెంటనే రంగంలోకి కూడా దిగింది. తమ మిలటరీ బలగాలను మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని బ్రిటన్ ప్రధాన మంత్రి కైర్ స్టార్మర్ స్వయంగా వెల్లడించారు. 'నేను యూకేకు ఏది మంచిదో అదే చేస్తాను. మిడిల్ ఈస్ట్‌కు మిలటరీ బలగాలను తరలిస్తున్నాం. ఏదైనా అత్యవసర పరిస్థితి రావచ్చొని ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన వెల్లడించారు. మరోవైపు ఫ్రాన్స్ కూడా అప్రమత్తమైంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా నేరుగా రంగంలోకి దిగకపోయినా.. తమ దేశంలో అమెరికన్లు, ఇజ్రాయెలీలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాలపై ఇరాన్ దాడికి పాల్పడే ముప్పును పసిగట్టి ఆ ప్రాంతాల్లో సైనిక భద్రత ఏర్పాటు చేసింది. అగ్రదేశాలు ఇజ్రాయెల్ వైపు నిలిస్తే.. అరబ్ దేశాలు, ఆమెరికా శత్రు దేశాలు ఇరాన్ పక్షం వహిస్తున్నాయి. ఈ క్రమంలో యెమెన్ ఆర్మీ ఇప్పటికే రంగంలోకి దిగింది. ఇరాన్ సమన్వయంతో ఇజ్రాయెల్‌పై రెండు హైపర్ సోనిక్ బాలిస్టిక్ మిసైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ఆర్మీ చీఫ్ ప్రకటించారు. అలాగే షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేన్(ఎస్‌సీవో) సభ్యదేశాల్లో భారత్ మినహా, యూరేషియా రీజియన్‌కు చెందిన చైనా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉబ్జెకిస్థాన్, పాకిస్తాన్ దేశాలు కూడా తమ సభ్య దేశమైన ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు ప్రకటించాయి. పాకిస్తాన్, తుర్కియే(టర్కీ) ఇప్పటికే ఇరాన్‌కు మద్దతునిస్తుండగా, మిగతా అరబ్ దేశాలు కూడా ఈ యుద్ధ పరిస్థితుల్లో తమకు అండగా నిలవాలని ఇరాన్ పిలుపునిచ్చింది. ఇలా ప్రపంచ దేశాలు దాదాపుగా చీలిపోయి కొన్ని ఇరాన్, మరికొన్ని ఇజ్రాయెల్ పక్షంలో చేరుతుండటంతో మూడో ప్రపంచయుద్ధం తప్పదేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ముగిసిన ఎస్పీఎల్ పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో నిర్వహించే మాదిరిగానే ఈ ఏడాది సైతం సింగుపురం యూత్, గ్రామ ప్రజల సహకారంతో ఎస్పీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. గత నెల రోజుల నుంచి క్రికెట్ పోటీలు జరుగగా ఆఖరి రోజు ఆదివారంతో ఎస్పీఎల్ పోటీలు ముగిశాయి. సింగుపురం, మునసబుపేట క్రికెట్ జట్లు ఆడగా మునసబుపేట క్రికెట్ జట్టు మీద సింగుపురం క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ పోటీల్లో గెలుపొందిన సింగుపురం క్రీడాకారులకు క్రికెట్ ట్రోఫీతోపాటు నగదు పురస్కారం రూ 20వేలు సాధించుకున్నారు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఆదిరెడ్డి హరికృష్ణ సొంతం చేసుకున్నారు. ఈ నగదు పురస్కారంతో పాటు ట్రోఫీని సింగుపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కొందలరావుతోపాటు జనసేన నాయకులు సింహాద్రి నాగేష్‌లు అందజేశారు. ఈ ఎస్పీఎల్ పోటీలకు సహకరించిన సింగుపురం గ్రామ ప్రజలు, యువతకు ఎస్పీఎల్ క్రికెట్ క్రీడాకారులు అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.



## ఎన్టీఆర్ అభిమానికి ఆర్థిక సాయం




(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని చిలకపాలెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎన్టీఆర్ అభిమాని అయిన బి.ఎర్రంనాయుడు ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారిపడి గాయపడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్, శ్రీకాకుళం జిల్లా టీం తారక్ ట్రస్ట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్ చిన్న కుమారుడు భార్గవ్‌రామ్ జన్మదినం సందర్భంగా రూ.28 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్, శ్రీకాకుళం జిల్లా టీమ్ తారక్ ట్రస్ట్ కోఆర్డినేటర్ డి.భాస్కర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మధు, వి.నరసింహమూర్తి, ఎం.షణ్ముఖరావు, జె.మల్లేశ్వరరావు (బ్రదర్స్), ఎస్.నేతాజీ, ఎస్.చలపతిరావు, ఏవీ నాయుడు, బి.శ్రీను (బ్రదర్స్), సి.అసిరినాయుడు, జి.సురేష్, ఎ.పెంటయ్య, కె.సాయిరాం, పి.శ్రీను, వై.దినేష్, కె.నాగరాజు శ్రీకాకుళం (ఎచ్చెర్ల) టీం తారక్ ట్రస్ట్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## మేజర్ మల్ల రామగోపాల్ నాయుడుకు సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పెద్దరెల్లివీధిలోనున్న డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసుమెన్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో జిల్లా మాజీ సైనికుల ఆధ్వర్యంలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్ల రామగోపాల్ నాయుడును ఘనంగా సత్కరించినట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం మీడియాకి తెలియజేశారు. వివరాల్లోకి వెళితే మేజర్ మల్లా రామగోపాల్‌నాయుడు, మరాఠా లైట్ ఇన్ఫాంట్రీ సోల్జర్. గత ఏడాది అక్టోబర్ 26న 56 రాష్ట్రీయ రైఫిల్స్‌లో ఉన్నప్పుడు కౌంటర్- చొరబాటు ఆపరేషన్ కోసం కుప్వారా జిల్లాలోని లైన్ ఆఫ్ కంట్రోల్ వెంట ఐదుగురు ఉగ్రవాదులను గుర్తించారు. వెంటనే ఆకస్మిక దాడి జరిగింది. భారీ శత్రు కాల్పులు జరిగాయి. మేజర్ నాయుడు వైపు గ్రెనేడ్లను కూడా విసిరారు, దీనినుంచి మేజర్ నాయుడు తృటిలో తప్పుకున్నారు. ప్రమాదం ఉన్నప్పటికీ మేజర్ నాయుడు తన జట్టుకు ముందున ఉండి నడిపించి ఐదుగురు ఉగ్రవాదులను తటస్థీకరించారు. ట్రూయెస్ట్ మిలిటరీ నాయకత్వం, తను ప్రదర్శించిన ధైర్య సాహసాలకు మేజర్ నాయుడుకి కీర్తిచక్ర ఈ ఏడాది మే 22న రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేశారు. మేజర్ నాయుడు కీర్తిచక్ర అవార్డును అందుకుని మొదటిసారి జిల్లాలోకి అడుగుపెట్టారు. ఆయనను ఎన్‌సీసీ క్యాడెట్‌లతో సాదరంగా స్వాగతించారు. ఇలాంటి గాలెంట్రీ అవార్డు రావడం మనజిల్లాకే కాదు, రాష్ట్రానికే గర్వకారణమన్నారు. మేజర్ రామగోపాల్‌నాయుడు కీర్తిచక్ర యువత కు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మేజర్ నాయుడు మాట్లాడుతూ యువత మనసులో దేశభక్తి అలవర్చుకున్న నాడు మనం ఒక సరికొత్త భారతావనిని చూడగలమన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, ప్రతినిధులు మెండ నారాయణ రావు, బి.చంద్రశేఖర్, జె.జె.రావు, పి.శంకరరావు, వి.సూర్య నారాయణ, పి.మురళీధరరావు, ఎస్.రామక్రిష్ణ, ఎమ్.సింహాచలం, తమ్మినేని కృష్ణారావు, బి.రాంబాబు, డి. వాసు దేవరావు, కె. రాజేంద్రప్రసాదరావు, సిహెచ్.రామారావు, బొంతు ఈశ్వరప్రసాద్, పొట్నూరు అన్నాజీరావు, పి.చిన్నారావు, ఇ.రాజారావు, బట్నమూర్తి, జి.రామారావు, పైడి రామారావు, ఎం.రాములు, పి.శ్రీనివాసరావు, కె.క్రాంతికుమార్, వి.గౌరీశంకర్, రత్నమాల, కె.జగ్గమ్మ, జి.ఆమ్మన్నమ్మ, పి.జమున, అన్నపూర్ణ, ఇల్ల మన్మధరావు, టంకాల రామారావు, పొట్నూరు గోవిందరాజు, తాళ్ల పాపారావు, పైడి నారాయణమూర్తి, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, టి.నాగరాజు, జితేంద్ర కుమార్, రవిక్రిష్ణలు పాల్గొన్నారు.



## శిష్టకరణ ప్రతిభావంతులు మరింత ఎదగాలి

(సత్యంన్యూస్, విజయనగరం)

ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సామాజికవర్గానికి చెందిన ప్రతి విద్యార్థి ఉన్నతమైన భావాలతో ఉత్తమమైన చదువు చదవాలని పలువురు శిష్టకరణ సంఘ నాయకులు కోరారు. ఆదివారం విజయనగరం శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిష్టకరణ సంఘ సమావేశంలో 78 మంది ఉత్తమ విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు పారితోషికంతోపాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పలువురు నాయకులు ప్రసంగించారు. సమావేశంలో 70 ఏళ్లు నిండిన 25 మంది వృద్ధ దంపతులకు పాదపూజ, ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సేవాసంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఇప్పటి వరకు ఉన్న కార్యవర్గాన్ని మరో ఏడాది కాలం పాటు కొనసాగించేందుకు సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా సంఘంలో ఉన్న కోశాధికారి పదవి ఖాళీ అయినందున ఆ పదవి విశాఖ జిల్లాకు కేటాయిస్తూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డీవీ కృష్ణారావు, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డి.జయబాబు, సదాశివుని కృష్ణ, గౌరీశ్వరరావు, రేగ సురేష్, వెంకటేష్, డబ్బీరు శ్రీనివాసరావు (వాసు), బి.శివప్రసాద్, ప్రభాకరదాస్, బి.హరిబాబు, పీవీటీ రమణరావు, బలివాడ శివకుమార్ పట్నాయిక్, పొట్నూరు పి.రవి, బీవీ ఎస్ఎన్ మూర్తి, బెహరా రామచంద్రరావు, శ్రీరామ్ కుమార్, పావని తదితరులు పాల్గొన్నారు.



## గేర్ మార్చిన స్వీట్ బ్యూటీ అనుష్క!!



అనుష్క మళ్లీ జోరు పెంచింది. కెరీర్ పీక్ లో వున్నప్పుడే సినిమాలకి విరామం ఇచ్చింది స్వీటీ. 'సైజ్ జీరో' సినిమా తర్వాత శరీరంలో వచ్చిన మార్పుల వల్ల అనూహ్యంగా బరువు పెరిగింది. ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ మళ్లీ మామూలు స్థితికి రాలేకపోయింది. దీంతో చాలా విరామం తీసుకున్న అనుష్క 'నిశ్శబ్దం' చిత్రంతో తిరిగి వచ్చింది. అందులో కూడా ఆమె బొద్దుగా కనిపించింది. ఆ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలి శెట్టి' చిత్రంలో నటించింది. ఆ సినిమా డీసెంట్ విజయం సాధించింది. ఇప్పుడు 'ఘాటి'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఇంతవరకు ప్రతి సినిమా మధ్య సుమారు రెండేళ్ల విరామం తీసుకుంటూ వచ్చిన ఆమె, ఇకపై అలాంటి తీరుకు గుడ్‌బై చెబుతోంది. వరుసగా సినిమాలు చేయాలని నిర్ణయించుకుంది. ఆ క్రమంలో కొత్త కథలు వినడం ప్రారంభించింది. 'జైలర్ 2'లో అనుష్క కీలక పాత్రలో కనిపించనుందని టాక్. అలాగే లోకేష్ కనగరాజ్ యూనివర్స్‌లో వచ్చే ఓ సినిమాలో కూడా ఆమె ఉంటుందని సమాచారం. మరోవైపు 'భాగమతి 2' చాలా కాలంగా వార్తల్లో వుంది. ఈ ఏడాదిలో ఆ సీక్వెల్ పై క్లారిటీ వచ్చే అవకాశముంది. సోలోగా 50 కోట్లు కలెక్ట్ చేయగల హీరోయిన్ అనుష్క. ఇప్పుడు ఆమె సినిమాల జోరు పెంచడం ఇండస్ట్రీకి ప్లస్సు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



ప్రకృతి పావని తన నీలి బికినీ చిత్రంతో ఈ వేసవిలో అందరి దృష్టిని ఆకర్షించనుంది. పచ్చని చెట్లతో చుట్టుముట్టబడిన కొలను దగ్గర, నేపథ్యంలో నీటి అందమైన దృశ్యాన్ని చూస్తూ ఈ గ్లామరస్ నటి నమ్మకంగా మరియు స్టైలిష్‌గా కనిపిస్తుంది. ప్రకృతి పావని భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. ఆమె చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పేరు, సినిమాలు మరియు టీవీ షోలలో తన పాత్రలకు కీర్తిని సంపాదించుకుంది. హౌ డస్ ఇట్ ఫీల్ (2023) మరియు ఓయిజా (2019) చిత్రాలలో తన నటనకు నటి మంచి గుర్తింపు పొందింది.

-తుపాకి.కామ్ సౌజన్యంతో...

## చెత్తకుప్పలో దొరికిన పిల్లను హీరోయిన్ చేశాడు!!





మిథున్ చక్రవర్తి ఓ రోజూ టీ తాగుతూ పేపర్‌లో కనిపించిన ఆర్టికల్ చదువుతున్నారు. అందులో ఓ చిన్నారి ఏడుస్తూ చెత్తడబ్బా దగ్గర కనిపించింది. ఆ పాపని గమనించి ఒకరు ఇంటికి తీసుకెళ్లారు అని ఉంది. అది చదవగానే ఆ పాపని తాను తీసుకోవాలనుకున్నాడు మిథున్. పాపకు, తనకూ ఏదో తెలియని అనుబంధం ఉందనిపించింది. అంతే భార్య యోగితా బాలితో మాట్లాడి ఆ చిన్నారిని ఇంటికి తీసుకువచ్చాడు. ఆ తరువాత గవర్నమెంట్ రూల్ ప్రకారం దత్తత కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు మిథున్ దంపతులు. ఆ చిన్న పిల్ల నేటి ప్రముఖ నట దిశాని చక్రవర్తి. దిశానీ చక్రవర్తి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ నుండి యాక్టింగ్ కోర్సును నేర్చుకొని. సోదరుడు ఉష్మే చక్రవర్తి దర్శకత్వం వహించిన షార్ట్ ఫిల్మ్ "హోలీ స్మోక్" తో నటిగా రంగ ప్రవేశం చేసింది. దిశ "అండర్ పాస్", "సబ్టిల్ ఏషియన్ డేటింగ్ విత్ పిబిఎమ్" వంటి లఘు చిత్రాలలో కూడా కనిపించింది.

టాలీవుడ్ హీరోయిన్ శ్రీలీల ఈమధ్య కాస్త దూకుడు తగ్గించినట్టు కనిపించినా మళ్లీ అమ్మడు ఫాం తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఐతే ప్రస్తుతం శ్రీలీల తెలుగులో మాత్రమే కాదు తమిళ, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేస్తుంది. ముఖ్యంగా బాలీవుడ్ లో అమ్మడు ఆషికి 3 సినిమాలో నటిస్తుంది. అనురాగ్ బసు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తుండగా శ్రీలీల లక్కీ ఛాన్స్ అందుకుంది. ఇప్పటికే సినిమా నుంచి రిలీజైన టీజర్ ఇంప్రెస్ చేసింది. ఆషికి 2 సినిమా సెన్సేషనల్ హిట్ అవ్వగా ఆషికి 3 సినిమా అంతకుమించి ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఐతే ఆషికి లవ్ స్టోరీస్ కి బాలీవుడ్ లో సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆషికి 2 తర్వాత శ్రద్ధ కపూర్ టాప్ రేంజ్ కి వెళ్లింది. ఐతే ఇప్పుడు ఆషికి 3 చేస్తున్న శ్రీలీలకు కూడా బి టౌన్ స్టార్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆషికి 3 సినిమా అనుకున్న విధంగా యూత్ ఆడియన్స్ కి ఎక్కేస్తే మాత్రం శ్రీలీల అక్కడ స్టార్ డం తెచ్చుకున్నట్టే. సౌత్ లో ఆల్రెడీ తన మార్క్ నటనతో అలరిస్తూ వస్తున్న శ్రీలీల బాలీవుడ్ లో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది. ఈ క్రమంలో బాలీవుడ్ లో చేస్తున్న తొలి సినిమానే ఒక బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ అవ్వడం తో అమ్మడి మీద అందరి దృష్టి ఉంది. తప్పకుండా ఆషికి 3 సినిమా సక్సెస్ అయితే మాత్రం శ్రీలీలని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. అంతేకాదు హిందీ పరిశ్రమలో బిజీ అయితే మాత్రం కచ్చితంగా టాలీవుడ్ కి శ్రీలీల దూరమయ్యే అవకాశం ఉంది. తెలుగులో ప్రస్తుతం శ్రీలీల రవితేజతో మాస్ జాతర, పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు చేస్తుంది. తమిళ్ లో కూడా శివ కార్తికేయన్ పరాశక్తి లో నటిస్తుంది. సో ఆషికి 3 సక్సెస్‌ని బట్టి హిందీలో శ్రీలీల కెరీర్ ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. శ్రీలీల కేవలం యాక్టింగ్ తోనే కాదు తన డ్యాన్స్ తో కూడా మెస్మరైజ్ చేస్తుంది. బాలీవుడ్ ఆడియన్స్ డ్యాన్స్ ప్రియులు కాబట్టి శ్రీలీల డ్యాన్స్ లకు కూడా వాళ్లు ఎట్రాక్ట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. ఆషికి 3 టైంలోనే కార్తీక్ ఆర్యన్‌తో క్లోజ్ గా ఉంటున్న శ్రీలీలని చూసి కార్తీక్‌తో ఆమె డేటింగ్ లో ఉందంటూ హడావిడి చేస్తున్నారు. ఏది ఏమైనా శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఒక సూపర్ క్లాసిక్ సినిమాతో జరగడం ఆమె లక్కీ అని చెప్పొచ్చు.

-తుపాకి.కామ్ సౌజన్యంతో...



## టాలీవుడ్‌కి దూరమవనున్న శ్రీలీల..?

## 'బోయిన'కి మాతృ వియోగం

(సత్యంన్యూస్, టెక్కలి)



టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర బీసీ సాధికారత కళింగ కోమటి కన్వీనర్, రాష్ట్ర కళింగ కోమట్ల సంఘ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు తల్లి బోయిన ప్రేమకుమారి (90) ఆదివారం కోటబొమ్మాళిలో తన నివాసంలో మృతిచెందారు. ఈమెకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో బోయిన రమేష్ కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అలాగే బోయిన గోపాలరావు, బోయిన సత్యానందం, బద్రి, మన్మథరావుతో పాటు కుమార్తె మంగమ్మ. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రేమకుమారి మృతి పట్ల కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, నేతలు కింజరాపు వరప్రసాదు సంతాపం వెలిబుచ్చారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం

(సత్యంన్యూస్, పాతపట్నం)



ఫీజు రీయింబర్స్మెంట్ అందకపోవడంతో, కళాశాలలు విద్యార్థులపై ఫీజుల భారం మోపుతున్నాయని, దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు మానేయాల్సి వస్తోందని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదింటి బిడ్డల ఉన్నత చదువులకు కూటమి సర్కారు గండి కొడుతోంది. ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వం (వైకాపా) అమలు చేసిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాను నిలిపివేసిందన్నారు. చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని, వారి భవిష్యత్తు అంధకారంలో పడుతుందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం సామాజిక న్యాయానికి, పేదల ఉన్నతికి దోహదపడేది, దీనిని నిర్లక్ష్యం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం పేదల ఆశలపై నీళ్లు చల్లుతోందని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'జగనన్న విద్యా దీవెన', 'జగనన్న వసతి దీవెన' వంటి పథకాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, దీనివల్ల వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కొండలా పేరుకుపోవడంతో కళాశాలల మనుగడ, విద్యార్థుల భవిష్యత్తు పెను ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు చెల్లింపులు చేయకపోవడం యావత్ కళాశాలల ఉనికినే ప్రశ్నార్థకమైందన్నారు.

## పాలఖండ్యాంలో విద్యార్థిమిత్ర కిట్స్ పంపిణీ



(సత్యంన్యూస్, రాజాం)

పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ గావించామని ప్రధానోపాధ్యాయిని ఆర్.ఎల్.కుమారి తెలిపారు. ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు 52మంది పిల్లలకు పాఠ్య పుస్తకాలు, బేగ్‌లు, నిఘంటువులను, ఆరో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు 52మంది పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, నిఘంటువులను అందజేశామని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఈ సామగ్రిని సర్పంచ్ దారబోయిన రెయ్యమ్మ, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్ చాంతాటి లక్ష్మి, గ్రామ పెద్దలు పలిశెట్టి సూర్యనారాయణ, డి.ధర్మరాజుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు, ఉప్పలపాటి ఆదిలక్ష్మి, యందువ వెంకటరమణ, వెలగాడ రాము, జీఎంఆర్ విద్యా వాలంటీర్ పిల్లల దాలమ్మలు పాల్గొన్నారు. వీరితోపాటు అంగన్వాడీ కార్యకర్త కుప్పిలి లక్ష్మి, బాలబడి కేంద్ర బోధకురాలు దారబోయిన జ్యోతి, ఆయా గుంటిబాని చిన్నమ్మడు, సయ్యద్ సబీనా, ఎస్.సమీరా, డొప్ప హేమలత, పిల్లల షర్మిళ, గుంటుబాని నందిని, జి.సుధ, కరగాన శ్రావణి, కరగాన పావని, పిల్లల మహేష్, జి.గిరిధర్, కోరాడ ధనుంజయ, డొప్ప దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సేవలు స్ఫూర్తిదాయకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సేవలు స్ఫూర్తిదాయకమని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకర్ అన్నారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణంలో డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ సహకారంతో సోమవారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జామి బీమశంకర్ మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జేసీఐ సభ్యుల సమాలోచనతో మజ్జిగ సేవ చేశారని, వేసవితో బాటసారులు, ప్రయాణికులు, రిక్షా కార్మికులు, ఆటో చోదకులు, దినసరి కూలీలు ఇబ్బందిపడుతున్నారని, నేటి మజ్జిగసేవ దాత డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్ అందించిన సహకారంతో ప్రయాణికుల దాహాన్ని తీర్చామన్నారు. అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, కార్యదర్శి తమ్మినేని ఉషారాణిలు మాట్లాడుతూ జేసీఐ శ్రీకాకుళం మెయిన్ నెలరోజుల పాటు నిరంతర సేవలు కొనసాగిస్తుందని, వీలైనంతవరకు మంచి నీళ్లను తరుచుగా తీసుకొని వేసవి ఉపశమనం పొందాలన్నారు. కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు జగదీశ్, సంతోష్, ఆర్టీసీ ఎస్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ఎస్పీ గ్రీవెన్స్‌లో జర్నలిస్టుల ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సీమాంధ్ర విజన్ సంపాదకులు పేడాడ హేమసుందర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. అధ్యక్ష, కార్యదర్శులు డోల శంకర్‌రావు, ప్రవీణ్ కుమార్ అడిషనల్ ఎస్పీతో మాట్లాడుతూ వార్తా కథనాలు రాసినందుకు ఎలక్ట్రికల్ ఏడి చల్లా వెంకటేశ్వరరావు సుమారు 50 మందితో ఇంటిపైకి దాడికి తెగబడటం అన్యాయమన్నారు. ఆయనపై కేసు నమోదు చేయాలని, దాడికి సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు డోల అప్పన్న, గణపతి, చింతాడ అప్పలనాయుడు, అద్దంకి సురేష్, ఆకుల మాధవ్, బొడ్డేపల్లి రాజేష్, వి.రాము, వెంకటేష్ పాల్గొన్నారు.



## అలరించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

(సత్యంన్యూస్, పొందూరు)

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల హైస్కూలు విభాగం పదో తరగతి 1974-75 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యుత్సాహంగా జరిగింది. యాభై ఏళ్ల తర్వాత వీరంతా కలుసుకున్న ఈ శుభ తరుణంలో ఒకరికొకరు ఆత్మీయంగా కుశల ప్రశ్నలు వేసుకొని ఉబ్బితబ్బిబ్బయ్యారు. వీరిలో దాదాపుగా అందరూ ఉద్యోగ విరమణ చేసినవారే కావడం గమనార్హం. వీరంతా వేదిక పైకి వచ్చి తమను గురించి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఇంజనీర్ సందుల రామకృష్ణ, విశ్రాంత డి.ఎం.హెచ్.వో సనపల తిరుపతిరావు, బండారు నాగమణి తదితరుల ఆధ్వర్యం వహించారు. విశ్రాంత లీడర్ డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు, విశ్రాంత హిందీ పండిట్ బస్వా దివాకర్‌రావు, నామ విజ్ఞాన వేత్త వాంద్రంగి కొండలరావు తదితరులను ఇదే వేదికపై సత్కరించారు. విశ్రాంత ఐ.ఎఫ్.ఎస్ అధికారి కూన సూర్యనారాయణ, డాక్టర్ జి.ఉమాదేవి, వి.రామావతారం, వి.కాశీవిశ్వనాథరావు, బల్ల అప్పారావు తదితరులు మాట్లాడారు. విశ్రాంత ఎస్.బి.ఐ అధికారి. వి.ఉదయభాస్కరరావు శ్రావ్యమైన గీతాలను పాడి అలరించారు. అలాగే కె.మాధవి, వి.నీరజ, వి.శ్యామల, వి.రమణి బృందగానం నిర్వహించారు.



# వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేసిన తిలక్



(సత్యంన్యూస్, టెక్కలి)

బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబునాయుడు పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ నియోజకవర్గ వైకాపా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు చేస్తున్న అరాచకాలు, ఏడాది పాలనలో చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు పాల వసంత రెడ్డి, కోటబొమ్మాళి, టెక్కలి ఎంపీపీ ప్రతినిధులు రోనంకి మల్లేశ్వరరావు, అట్ల రాహుల్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మార్పు అశోక్‌చక్రవర్తి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షులు సంపదరావు హేమ సుందర్ రాజు, తమిరి ఫల్గుణరావు, పార్టీ అధికార ప్రతినిధి సత్తారు సత్యం పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## రిమ్స్ అన్నపూర్ణకు 20వేలు వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీకాకుళం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగుల సహాయకులకు నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకంకు శ్రీకాకుళం పట్టణం బ్యాంకర్స్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉప్పు దామోదరరావు, ఆయన కుమారులు సాయినీల్, సాయి శ్రావణ్‌ల పుట్టినరోజు సందర్భంగా సోమవారం రూ.20వేలు రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణబాబుకు అందజేశారని జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలియజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా రోగుల సహాయకులకు ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి రెండుపూటలా అవిశ్రాంతంగా సేవలందిస్తున్న అన్నపూర్ణ ట్రస్ట్‌ను అభినందించారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు క్షయరోగులకు దీర్ఘకాలిక రోగులకు ప్రతిరోజు రెండు పూటలా వేడినీళ్లు, మినరల్ వాటర్ కూడా అందజేయడం అభినందనీయమని, ఇటువంటి సేవలు నిస్వార్థంగా నిరాటంకంగా అందిస్తున్న ఏకైక సంస్థ శ్రీ సత్యసాయి సంస్థని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సత్య జ్యువెలర్స్ కృష్ణారావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. విరాళం అందజేసిన దామోదర్‌ను రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్షణరావు అభినందించారు.





స్థానిక జండాలవీధి నివాసి, జిల్లా వెనుకబడిల సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షులు అమీరుల్లా బేగ్ సతీమణి సమర్జాన్ బేగం ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. సమర్జాన్ బిగ్ ఆత్మ శాంతించాలని వేడుకున్నారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన పులఖండం శ్రీనివాసరావు కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, ఎం.ఎ.బేగ్, గేదెల పురుషోత్తం, భైరి మురళి, కర్నేని హరిబాబు, కింజరాపు రమేష్ నాయకులు ఇసుముర్ రహిమాన్,బేగ్‌లు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

(సత్యంన్యూస్, పొందూరు)

స్థానిక రైల్వే స్టేషన్ ట్రాక్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. కదులుతున్న రైలు నుంచి జారి పడడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. ఘటన పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే జిఆర్పి స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.




## 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలపై వైకాపా ఆధ్వర్యంలో ప్రచురించిన 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ సోమవారం జిల్లా వైకాపా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రజలను నిట్టనిలువుగా మోసగించిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కూటమి ప్రభుత్వానికి గెలిపించి మోసపోయామని పశ్చాత్తాప భావనలో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలను ఎలా మోసగించిందనేది ఈ పుస్తకంలో అక్షరం పొల్లు పోకుండా ఉంటుందని కృష్ణదాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పిరియా విజయ, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆముదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త రవికుమార్, జిల్లా వైకాపా నాయకులు మామిడి శ్రీకాంత్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ దుంపల లక్ష్మణరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, సుడా మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణగుప్తా, పొందర కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు రాజాపు అప్పన్న, కార్యకర్తలు పాల్గొన్నారు



## అన్నదానం మహాదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దానాలన్నింటిలోకి అన్నదానం మహాదానమని బిహెచ్ఆర్సీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం అన్నవితరణలో భాగంగా బిహెచ్ఆర్సీ వైస్ చైర్‌పర్సన్ డా.ఎన్.ప్రభు మాట్లాడుతూ నగరంలో కొత్తరోడ్డు, డే అండ్ నైట్, అరసవల్లి దేవాలయ ప్రాంగణం, మిల్ జంక్షన్, పాత బస్ స్టాండ్‌తో పాటు పలు ముఖ్య కూడలిలో నిరుపేదలకు భారతీయ హ్యూమన్ రైట్స్‌కౌన్సిల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతి అందించిన సహకారంతో నిర్వహించామన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ మహత్తరమని, అందులోనూ స్వయం పాకంతో ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని సుమారు వంద మందికి పైగా నిరుపేదలకు అందించి ఆకలి తీర్చటం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజులలో బిహెచ్ఆర్సీ తరపున అన్నదానాలతోపాటు, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించటమే ధ్యేయంగా, అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పిఎన్. మణిశర్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.సౌజన్య పట్నాయక్, బిహెచ్ఆర్సీ సభ్యుల బృందం, సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221















## అరికట్టాల్సినవారే అవినీతిపరులుగా!

(మొదటిపేజీ తరువాయి)

అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఉపరవాణా శాఖాధికారి కార్యాలయాల్లోనూ పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందన్న విషయం అందరికీ తెలుసు. కానీ ఇక్కడ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు గానీ, లంచం తీసుకుంటుండగా దొరికే ట్రాప్ కేసులు గానీ పెద్దగా ఉండవు. కారణం అందరికీ తెలుసు. అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలున్న ఏసీబీ ఉద్యోగులపై విచారణ చేపట్టాల్సిన ఉన్నతాధికారులు ప్రస్తుతానికి బదిలీతో సరిపెట్టారు. అంటే మళ్లీ మాతృశాఖకు వీరు వెళ్లిపోతున్నారు. బీసీ ఉపకార వేతనాల కుంభకోణంలో అప్పటి ఏసీబీ అధికారులు కొందరి పాత్రపై ఏసీబీ హెడ్ ఆఫీస్‌కు ఫిర్యాదులు వెళ్లినా వారిని ఇంకా ఏసీబీలోనే కొనసాగించడం కొసమెరుపు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు జరిగిన బదిలీల్లో ప్రస్తుతం శ్రీకాకుళం ఏసీబీలో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లకు బదిలీ అయింది. విజయనగరంలో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్‌కు బదిలీ కాగా విశాఖపట్నంలో ఒక అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు సీఐలు మాత్రమే ఏసీబీలో మిగిలారు. ప్రస్తుతం కొత్తవారితో ఏసీబీని ఎలా పరుగులు పెట్టిస్తారో చూడాలి.



## పరిష్కరించకుండానే సంతకం చెయ్యమంటున్నారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, సమస్య పరిష్కారం కాకుండానే అయిందని చూపించడానికి సంతకం చేయాలని ఈవోపీఆర్డీ తనపై ఒత్తిడి తెస్తున్నారని రాగోలుపేటకు చెందిన ధనుంజయరావు ఎంపీడీవో శైలజకు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 7/2లో 12.60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నల్లచెరువు గట్టుపైకి జేసీబీని తీసుకువచ్చి ఫోటోలు తీసుకొని సమస్యకు పరిష్కారం చూపించినట్టు తెలిపి వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమార్కులు మట్టి తవ్వడానికి చెరువుగట్టును చదునుచేసే సమయంలో తొలగించిన తాటిచెట్లను జేసీబీతో తీసుకువచ్చి గట్టుపై వేసి వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యలతో సమస్యకు పరిష్కారం చూపించామని ఈవోపీఆర్డీ అర్జీని క్లోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ధనుంజయరావు ఎంపీడీవోకు విన్నవించారు. మట్టి తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులతో కుమ్మక్కై వారి చర్యలను సమర్థించే ప్రయత్నం అధికారులు చేస్తున్నారని ధనుంజయ ఆరోపిస్తున్నారు. ఫిర్యాదుపై స్పందించకుండా గ్రీవెన్స్‌కు పరిష్కారం చూపించినట్టు మండల అధికారులు చేస్తున్న ప్రయత్నాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళుతున్నట్టు తెలిపారు.

## శ్రీకూర్మ ఆశ్రమాన్ని పునర్నిర్మిస్తాం

- సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ -



(సత్యంన్యూస్, హిరమండలం)

శ్రీకూర్మ ఆశ్రమ విషయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి హిందూ వైదిక ఇస్కాన్ హరే రామ, హరే కృష్ణ ఆశ్రమ పునర్నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. కూర్మ గ్రామంలో ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటు చేసుకున్న ఆశ్రమం ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడంతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గేదెల చైతన్య, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలి

✶ కిమ్స్‌ను ప్రారంభించిన మంత్రి అచ్చెన్న




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అత్యుత్తమ ప్రమాణాలు పాటించి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. స్థానిక న్యూబ్రిడ్జ్ రోడ్డులో అధునాతన సౌకర్యాలతో ఆధునీకరించబడిన కిమ్స్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాల్టీ వైద్యం ఒకేచోట అందించే లక్ష్యంతో కిమ్స్‌ను ఆధునీకరించడంపై యాజమాన్యాన్ని అభినందించారు. రోబోటిక్ సర్జరీ వంటి ఆధునిక వైద్యసేవలు అందుబాటులో తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్, బీమా సంస్థల తోడ్పాటుతో ప్రజలకు భరోసా కల్పించి ఆరోగ్యవంతమైన జీవితం అందించేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అన్ని తరగతుల ప్రజలకు వైద్యం అందించేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు. కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ప్రపంచస్థాయి వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కిమ్స్‌ను అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించామని, 300 పడకలు సామర్థ్యంతో, 36 మంది వైద్య నిపుణులతో ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన సూపర్ స్పెషాల్టీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. సూపర్ స్పెషాల్టీ వైద్యనిపుణులు, నర్సింగ్ సిబ్బంది, 24/7 అత్యవసర సేవలు, క్యాష్‌లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం, కార్పొరేట్ కంపెనీలతో టై-అప్ చేసి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. తక్షణ వైద్యం స్థానికంగానే పొందే అవకాశం కిమ్స్‌లో లభిస్తుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కిమ్స్ ఫౌండర్ బి.కృష్ణయ్య, బీఎస్‌సీపీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బి.సీనయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, డాక్టర్ పీజే నాయుడు, ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవిసంతోష్, ఆపరేషన్స్ అండ్ క్వాలిటీ జీఎం వేదవతి, మెడికల్ సూరింటెండెంట్ సోమేశ్వరరావు, పీఆర్‌వోలు గోపి, భాస్కర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.






## ఆధ్యాత్మిక కేంద్రాల్లో యోగా ఓ యజ్ఞం




- ❖ వ్యసనాల నివారణకు యోగాయే మార్గం
- ❖ పాశ్చాత్య దేశాల్లో నిత్య చర్యగా స్వీకరించిన పురాతన సంప్రదాయాన్ని మనం ఆచరించకపోవడం దురదృష్టం
- ❖ శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్
- ❖ శ్రీకూర్మంలో యోగాంధ్ర వేడుకలు



(సత్యంన్యూస్, గార)

శ్రీకూర్మం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా నిర్వహించడం ఒక యజ్ఞంతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. చారిత్రక ప్రదేశాలలో ఒకటైన శ్రీకూర్మం గ్రామంలో నెల రోజుల యోగాంధ్ర వేడుకలలో భాగంగా సోమవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు యోగా సాధలతో కలసి యోగాంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ శ్రీకాకుళంలో యోగాంధ్రను పండగలా నిర్వహిస్తున్నామని, ఈ నెల 21న విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారని తెలిపారు. యోగా మన పురాతన సంప్రదాయంగా, ఉన్నప్పటికీ దాన్ని అందరూ ఆచరించకపోవడం దురదృష్టకరమన్నారు. పాశ్చాత్య దేశాలు యోగాను నిత్యచర్యగా స్వీకరించాయని గుర్తుచేశారు. పిల్లలు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే యోగా మంచి మార్గమని చెప్పారు. స్థానిక 80 అడుగుల రహదారిలో ప్రతిరోజూ అనుభవజ్ఞులైన శిక్షకులతో యోగా శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, టూరిజం అధికారి నారాయణరావు, డిడబ్ల్యూఎంఎ పీడీ సుధాకరరావు, ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్, డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా, జె.శేఖరరావు, ఎన్‌వైఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీ, సర్పంచ్ గోరు అనిత, మాజీ సర్పంచ్ కోరాడ వెంకటరావు, మాజీ ఎంపీటీసీ కైబాడ రాజు, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, పెద్ద సంఖ్యలో శ్రీకూర్మం పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.



## 'జన గణన' ప్రక్రియ షురూ

- నోటిఫికేషన్ జారీ చేసిన హోంశాఖ -



**న్యూఢిల్లీ:** దేశంలో 15 ఏళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైనట్లయ్యింది. మొత్తంగా రెండు దశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది.


కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌తో సహా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నామని, ఇవి కాకుండా దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నామని హోంమంత్రిత్వ శాఖ ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇది స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కోవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

## వాహన చోదకులకు ఇక్కట్లు

## నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు





వాహనాలు రాకపోకలు

(సత్యంన్యూస్, రాగోలు)

రాగోలు సమీపంలోని రాయిపాడు వద్ద రోడ్డుపై వాహనాలు గంటలకొద్దీ నిలిచిపోతుండంతో నిరంతరం వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో రాయిపాడు వద్ద పంట కాలువపై కల్వర్టు నిర్మాణంలో జాప్యంతో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. శ్రీకాకుళం రూరల్ పోలీసు సిబ్బంది రాయిపాడు కల్వర్టు వద్దకు చేరుకొని వాహనాలను క్రమద్దీకరించే ప్రయత్నం చేస్తున్నా, ఇబ్బందులు తప్పడంలేదని వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు నిర్మాణం కొంతమేర పూర్తిచేసినా, కల్వర్టు నిర్మాణాలు జరగలేదు. మిగతా ప్రాంతాల్లో కొన్నిచోట్ల కల్వర్టులు పూర్తి చేశారు. రాయిపాడు వద్ద పంట కాలువపై కల్వర్టు నిర్మాణానికి ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. దీంతో గతంలో ఉన్న కల్వర్టుపై నుంచి రాకపోకలు చేస్తున్నారు. ఎదురెదురుగా వాహనాల రాకపోకలు సాగించడానికి కల్వర్టు అనువుగా లేదు. దీంతో ఎదురుగా వాహనం కల్వర్టును దాటి తర్వాత మరో వాహనం వెళ్లాల్సిన పరిస్థితి. నిత్యం ఇసుక లారీలతో పాటు ఇతర సాగిస్తూ రద్దీగా ఉండడంతో రాయిపాడు కల్వర్టు వద్ద వాహనాలు నిరీక్షంచక తప్పడంలేదు. పాఠశాల, కళాశాల బస్సులతో మరింత రద్దీగా తయారైంది. కల్వర్టు పూర్తి చేస్తే తప్ప దీనికి మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు రాయిపాడు కల్వర్టు వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.